సాక్షి
యాదాద్రి భువనగిరి
సోమవారం । 7 । అక్టోబర్ । 2024



ట్రావెల్స్ బస్సు బోల్తా..
నల్లగొండ మున్సిపల్ పరిధిలోని మర్రిగూడ బైపాస్‌లో ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. - 8లో



నాలుగేళ్లుగా అసంపూర్తిగానే..
పిలాయిపల్లి – దేశ్‌ముఖి వరకు చేపట్టిన రహదారి పనులు నాలుగు సంవత్సరాలు గడుస్తున్నా పూర్తి కావడం లేదు. - 9లో



దసరా సందడి
దసరా నేపథ్యంలో షాపింగ్ మాల్స్ డిస్కౌంట్‌లు ప్రకటించడంతో కొనుగోలు దారులతో రద్దీగా మారాయి. - 9లో

సన్న వడ్లకు సెపరేటు

ప్రత్యేకంగా 60 కొనుగోలు కేంద్రాలు

- 66 వేల మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా
- దసరా తర్వాత కొనుగోళ్లు
- కార్యాచరణ రూపొందించిన యంత్రాంగం



ఆత్మకూర్(ఎం) మండలంలో సాగు చేసిన సన్నరకం వరి



వరి సాగు ఇలా (ఎకరాల్లో)	
మొత్తం	2,81,885
దొడ్డు	2,45,102
సన్నాలు	36,783
దొడ్డు రకం	5,39,224

దిగుబడి అంచనా (మెట్రిక్ టన్నులు)	
మొత్తం	6,12,790
రైతులు విక్రయించేది	4,88,542
సన్నరకం	66,827
రైతులు విక్రయించేది	33,254

భువనగిరి : వానాకాలానికి సంబంధించి ధాన్యం కొనుగోళ్లకు యంత్రాంగం సన్నద్ధమవుతోంది. ఇప్పటికే వరికోతలు ప్రారంభం కావడంతో దసరా తరువాత కొనుగోలు కేంద్రాలు తెరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేసింది. ధాన్యం సేకరణకు అవసరమైన యంత్రాలు, గన్నీ బ్యాగులు, ఇతర సామగ్రిని సమకూర్చుకునే పనిలో నిమగ్నమైంది. అయితే ఈసారి సన్నరకం వడ్ల సేకరణకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. సాధారణ రకంతో సంబంధం లేకుండా 50 నుంచి 60 కేంద్రాల్లో కేవలం సన్నరకం వడ్లను మాత్రమే కొనుగోలు చేయనున్నారు. గతంలో సన్న, దొడ్డు రకం వడ్లు ఒకే చోట విక్రయించడం వల్ల సమస్యలు ఎదురయ్యేవి. మిక్సింగ్ ధాన్యం వచ్చిందని మిల్లర్లు దిగుమతి చేసుకోవడానికి కొర్రీలు పెట్టేవారు. ఇటువంటి సమస్యలు రాకుండా ఉండటానికి సన్నాల కొనుగోలుకు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈసారి వరికి మద్దతు ధర సాధారణ రకానికి క్వింటాకు రూ.2,320, సన్నాలకు రూ.2,820 ప్రకటించింది. అయితే సన్నాలకు రాష్ట్ర ప్రభుత్వం క్వింటాకు రూ.500 ప్రకటించింది. దీంతో పాటు ప్రత్యేక కేంద్రాలు ఏర్పాటు చేస్తుండడంతో సన్న రకం వడ్లు సాగు చేసిన రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

జిల్లాలో వరి సాగు ఇలా..

ఈ వానాకాలం సీజన్‌లో జిల్లా వ్యాప్తంగా 2,81,885 ఎకరాల్లో వరి సాగైంది. 6,12,790 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. ఇందులో 4,88,542 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని రైతులు విక్రయించే అవకాశం ఉందని భావిస్తున్నారు. అందుకు అనుగుణంగా 323 కేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్యాచరణ రూపొందించారు. ఇందులో ఐకేపీ 90, పీఏసీఎస్ ఆధ్వర్యంలో 220 కేంద్రాలు ఉన్నాయి. మిగతావి మార్కెట్ కమిటీలు, రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేసున్నారు.

సన్నరకం ధాన్యాన్ని గుర్తించేందుకు ప్రత్యేక యంత్రం

మొత్తం వరి సాగులో 36,783 ఎకరాలు సన్న రకం వేశారు. 66,827 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేసి పౌరసరఫరాల శాఖకు నివేదిక ఇచ్చారు. సన్నాల కొనుగోలుకు ఎక్కడెక్కడ ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కార్యాచరణ రూపొందిస్తున్నారు. మూసీ పరీవాహక మండలాల్లో సన్నాలు అధికంగా సాగు చేశారు. ఇదిలా ఉండగా సన్నరకం వడ్లను గుర్తించడానికి కొనుగోలు కేంద్రాల్లో ప్రత్యేక యంత్రం(గ్రేన్ కాలివేర్) అందుబాటులోకి తీసుకురానున్నారు.

ప్రణాళిక సిద్ధం చేస్తున్నాం

సన్నాల కొనుగోలుకు ఈసారి ప్రత్యేకంగా కేంద్రాలు ఏర్పాటు చేస్తాం. వ్యవసాయ అధికారులు ఇచ్చిన నివేదిక మేరకు ఎక్కడెక్కడ కేంద్రాలు ఏర్పాటు చేయాలో కార్యాచరణ రూపొందిస్తున్నాం. దసరా తరువాత కొనుగోళ్లు ప్రారంభిస్తాం.

–జగదీష్‌కుమార్, జిల్లా సివిల్ సప్లై మేనేజర్

• రూ.45 లక్షలతో అమ్మవారి అలంకరణ



చౌటుప్పల్ పట్టణంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన దుర్గాదేవిని 10, 20, 50, 100, 200, 500 నోట్లు మొత్తం రూ.45 లక్షలతో అలంకరించిన నిర్వాహకులు

అలైన్‌మెంట్ మార్చకుంటే ప్రజాగ్రహం తప్పదు

- బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి



మాట్లాడుతున్న గూడూరు నారాయణరెడ్డి

సాక్షి, యాదాద్రి : రీజినల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ ఔటర్ రింగ్ రోడ్డుకు 35 కిలో మీటర్ల ఆవలకు మార్చాలని, లేనిపక్షంలో ప్రజాగ్రహం తప్పదని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.. వెనకబడిన ప్రాంతాల అభివృద్ధికి కేంద్రం నిధులు ఇస్తుందే కానీ, ఎక్కడ ఆ పనులు చేయాలన్నది రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుందన్నారు. రీజినల్ రింగ్‌రోడ్డు వల్ల ఔటర్ రింగ్ రోడ్డుకు 25 కిలో మీటర్ల దూరంలో ఉన్న రాయగిరి పరిసర గ్రామాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే జాతీయ రహదారి, బస్వాపురం రిజర్వాయర్ కాలువలు, వైటీడీఏ రోడ్డు విస్తరణ, హైటెన్షన్ విద్యుత్ లైన్ల కోసం రాయగిరి ప్రజలు భూములు కోల్పోయారని, మరోసారి భూములు తీసుకోవడమంటే వారి పొట్టగొట్టడమేనన్నారు. వెనుకబడిన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి రాజాపేట, యాదగిరి గుట్ట ఆవలివైపు, మోటకొండూరు నుంచి అలైన్‌మెంట్ మార్చడానికి సీఎం చర్యలు తీసుకోవాలని కోరారు. చౌటుప్పల్ వద్ద ఫార్మా కంపెనీల కోసం అలైన్‌మెంట్ మార్చడాన్ని ఆయన తప్పుపట్టారు. సంపన్న వర్గాలు, వ్యాపారులకు అనుకూలంగా పనిచేయవద్దన్నారు. రైతులతో పాటు వివిధ వర్గాలు తమకు జరిగే నష్టానికి ఓటు ద్వారా బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు.

న్యూస్‌రీల్

గుట్టలో బయోవేస్ట్ ప్లాంట్

సాక్షి, యాదాద్రి : యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో బయోవేస్ట్ ప్లాంట్ ఏర్పాటు చేయడానికి దేవాదాయ మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. రూ.3.5 కోట్ల వ్యయంతో కొండ కింద ఈ ప్లాంట్ ఏర్పాటు చేయనున్నారు. దేవస్థానంలో స్వామివారి పూజా కార్యక్రమాలకు వినియోగించిన పూలు, ఆలయ అవసరాలు, భక్తులు వాడి పడేసిన ప్లాస్టిక్ డబ్బాలు, బాటిళ్లు, ఇతర వ్యర్థాలను ఈ ప్లాంట్ ద్వారా శుద్ధీకరణ చేయనున్నారు. ప్లాంట్ ఏర్పాటుకు త్వరలోనే సన్నాహాలు ప్రారంభిస్తామని ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

భువనగిరి డాక్టర్‌కు వైద్యరత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ రాజ్‌కుమార్

భువనగిరి : పట్టణంలోని శ్రీఆర్కె హాస్పిటల్ అధినేత డాక్టర్ చావా రాజ్‌కుమార్‌కు వైద్య రత్న అవార్డు లభించింది. పల్లెపల్లెకు వైద్యం పేరుతో పదేళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటు చేయడం, తక్కువ ఖర్చుతో పేదలకు వైద్యం అందిస్తున్నందుకు గాను బహుజన సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో అవార్డు ప్రకటించారు. ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతిలో ఆదివారం నిర్వహించిన ఎనిమిదవ సౌత్ ఇండియా నేషనల్ ఇండియా కాన్ఫరెన్స్‌లో అవార్డు ప్రదానం చేశారు. డాక్టర్ రాజ్‌కుమార్‌కు పలువురు వైద్యులు అభినందనలు తెలిపారు.

ఆడపడుచులను మోసం చేసిన రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న బూడిద భిక్షమయ్యగౌడ్

సాక్షి, యాదాద్రి : ఎన్నికల సమయంలో ఆడపడుచులకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి విస్మరించారని ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ విమర్శించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. నెలకు రూ.2,500 ఇస్తామన్న విషయాన్ని మర్చిపోయారా? అని ప్రశ్నించారు. పది నెలలుగా ఒక్కో మహిళకు రూ.25 వేలు ఈ ప్రభుత్వం బాకీ పడిందన్నారు. అలాగే కేసీఆర్ ఆడపడుచులకు గతంలో ఇచ్చిన బతుకమ్మ చీరలను కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఇవ్వలేదన్నారు. బతుకమ్మ పండుగకు ప్రభుత్వం ఇచ్చే చీర,సారే కోసం రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది మహిళలు ఎదురు చూస్తున్నా సీఎం ఎందుకు స్పందించడం లేదని మండిపడ్డారు. అన్ని వర్గాలను మోసం చేసినట్లే మహిళలను మోసం చేశారని ఆరోపించారు.

ప్రజల దృష్టిని మరల్చేందుకే ‘హైడ్రా’



మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

సంస్థాన్ నారాయణపురం : కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, వాటి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే హైడ్రాను తీసుకువచ్చిందని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు విమర్శించారు. సంస్థాన్‌నారాయణపురం మండలం పుట్టపాకలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అర్హులందరికీ రుణమాఫీ చేయలేదని, ఖరీఫ్ ముగిసినా రైతుభరోసా డబ్బులు ఇవ్వలేదన్నారు. అంతకుముందు సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సమావేశంలో నాయకులు కల్లూరి మల్లేశం, దొంతగాని పెద్దులు, ఐతరాజు గాలయ్య, శివశెట్టి లాలయ్య, చింతకాయల నరసింహ, రావిరాల మల్లేష్, మర్రి వసంత, పిట్ట రాములు, వర్కాల చంద్ర శేఖర్, కొత్త శ్రీకాంత్, దొంతగాని అమరేందర్, నడుకుడి నరసింహ పాల్గొన్నారు.

వార్డెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వలిగొండ : మండలంలోని లోతుకుంట గ్రామ బాలికల మోడల్ స్కూల్‌లో వార్డెన్‌తో పాటు కేర్ టేకర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ భాస్కర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు అర్హులని, ఈ నెల 8లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. అలాగే లోతుకుంట కస్తూరిబా గాంధీ బాలికల విద్యాయలంలో స్వీపర్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈఓ పేర్కొన్నారు. 7వ తరగతి పూర్తి చేసి 18 నుంచి 40 ఏళ్ల వయస్సున్న మహిళలు అర్హులన్నారు. 8వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

బిక్కేరులో గోదావరి పరవళ్లు



గుండాల మండలం అనంతారం వద్ద బిక్కేరు వాగులో పారుతున్న గోదావరి నీళ్లు

- నిండనున్న చెరువులు, కుంటలు
- యాసంగిలో తీరనున్న సాగునీటి సమస్య
- రైతు మోములో ఆనందం

గుండాల : కరువు నేలపై జలసిరులు సవ్వడి చేస్తున్నాయి. మల్లన్నసాగర్ నుంచి గంధమల్లకు చేరిన గోదారమ్మ.. అక్కడి నుంచి చెరువులను నింపుతూ గుండాల మండలం అనంతారం పరిధిలోని బిక్కేరులోకి చేరింది. వాగు వెంట ఉన్న అనంతారం, పల్లెపహాడ్, పారుపల్లి, అంబాల మీదుగా మోత్కూరు నుంచి వంగాల వరకు గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతుతుండడంతో రైతు మోములో ఆనందం కనిపిస్తోంది. గత ఏడాది వానాకాలం నుంచి సరైన వర్షాలు లేకపోవడంతో గుండాల మండలంలో చెరువులు, కుంటలు అడుగంటాయి. దీంతో ఈ వానాకాలం రైతులు అంతంతమాత్రంగానే వరి సాగు చేశారు. గోదావరి జలాల రాకతో బిక్కేరు పరీవాహక ప్రాంతంలో భూగర్భ జలాలు పెరగడంతో పాటు పలు చెరువులు, కుంటలు నిండనున్నాయి. దీంతో యాసంగి సాగుకు నీటి సమస్య తీరే అవకాశం ఉంది.

యాసంగికి ఇబ్బంది ఉండదు



నీళ్లు లేకపోవడంతో వల్ల వానాకాలం మా ప్రాంతంలో సాగు భూములు పడావుగా ఉన్నాయి. ఇప్పుడు గోదావరి జలాలతో బిక్కేరు వాగు పారుతుండడంతో ఆనందంగా ఉంది. బోర్లు, బావుల్లోకి నీరు పైకి వచ్చే అవకాశం ఉంది. యాసంగిలో నాలుగు ఎకరాలు నాట్లు వేస్తాం.

–భాశెట్టి వీరస్వామి, రైతు, అనంతారం

ఆనందంగా ఉంది



కాళేశ్వరం జలాలతో బిక్కేరు వాగు పారుతుంది. యాసంగిలో వరి సాగు పెరిగే అవకాశం ఉంది. వానాకాలంలో రెండున్నర ఎకరాల్లో వరి వేశాను. కానీ, నీరు లేకపోవడంతో ఎండి పోతుంది.గోదావరి జలాలు వస్తుండడంతో ఆనందంగా ఉంది. ఎమ్మెల్యే అయిలయ్యకు కృతజ్ఞతలు.

–కే.రాజారత్నం, రైతు, అనంతారం

గంధమల్లను పూర్తి చేసి నీటి సమస్య పరిష్కరిస్తా

- ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



బీర్ల అయిలయ్య

సాక్షి, యాదాద్రి : అన్నదాత కళ్లలో ఆనందం చూడటమే ధ్యేయమని, సాగునీటి కోసం రైతులు ఇబ్బంది పడవద్దన్న ఉద్దేశంతో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి మల్లన్నసాగర్‌నుంచి నీటిని విడుదల చేయించినట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య పేర్కొన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు.ఆలేరు నియోజకవర్గంలో పది రోజులుగా గోదావరి జలాలు పరవళ్లు తొక్కుతున్నాయన్నారు. గంధమల్ల చెరువు అలుగుపోస్తుండంతో రాజాపేట, యాదగిరిగుట్ట, ఆలేరు, మోటకొండూరు, ఆత్మకూర్(ఎం), గుండాల మండలాల మీదుగా తుంగతుర్తి నియోజకవర్గంలోని మోత్కూరు బిక్కేరు వాగులోకి గోదావరి జలాలు చేరాయన్నారు. ఆలేరు వాగునుంచి బిక్కేరు వాగు వరకు నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు, చెక్ డ్యాంలు జలకళను సంతరించుకుంటున్నాయని తెలిపారు. భూగర్భ జలాలు పెరుగుతండడంతో ఆగిపోస్తున్న బోర్లు రీచార్జి అవుతున్నాయన్నారు. రైతులు, ప్రజలు గోదావరి జలాలకు పూజలు చేస్తూ ఆనందం వ్యక్తం చేస్తున్నారని పేర్కొన్నారు. యాసంగి సాగుకు సాగునీటి సమస్య తలెత్తే అవకా శం ఉండదన్నారు. ఆరు నెలల తర్వాత మరోసారి మల్లన్నసాగర్ నుంచి నీటిని వదలాలని కాళేశ్వరం ఈఎన్‌సీని కోరగా ఆయన అంగీకరించారని పేర్కొన్నారు. గంధమల్ల ప్రాజెక్టును పూర్తి చేసి నియోజకర్గంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతానన్నారు.

రేపు గొర్రెల వేలం

చౌటుప్పల్ రూరల్ : తెలంగాణ ప్రభుత్వం గొర్రెల పథకం కింద పంపిణీ చేసిన గొర్రెలను అక్రమంగా కొనుగోలు చేసి తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్న గొర్రెలను మంగళవారం వేలం వేయనున్నట్లు జిల్లా పశువైద్య, పశు సంవర్ధక అధికారి ఒక ప్రకటనలో తెలిపారు.చౌటుప్పల్ మండలం పెద్దకొండూర్‌లోని పశువైద్య శాల ఆవరణలో వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన రైతులు బహిరంగ వేలంలో పాల్గొనాలని కోరారు.

నారసింహుడికి నిత్యారాధనలు


యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఆదివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున సుప్రభాత సేవ, స్వయంభూలకు ఆరాధన, నిజాభిషేకం, తులసీదళ అర్చన జరిపించారు. అనంతరం ప్రథమ ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం, గజవాహన సేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, ముఖ మండపంలో అష్టోత్తర పూజలు నిర్వహించారు.



నిత్యకల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

నాడి పట్టే నాథుడేడి!

- ఆలేరు సీహెచ్‌సీలో అరకొర వైద్యం
- 14 మంది డాక్టర్లకు గాను ఆరుగురే..
- ఉన్నవారూ సకాలంలో విధులకు హాజరుకారు
- మధ్యాహ్నానికే తిరుగుముఖం
- సేవలందక రోగులు విలవిల





వైద్యుడి కోసం నిరీక్షిస్తున్న రోగులు

ఆలేరు రూరల్ : ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో వైద్యుల కొరత వేధిస్తోంది.రోజువారి వచ్చే వందలాది మంది ఔట్‌పేషెంట్, ఇన్‌పేషెంట్ రోగులకు వైద్య సేవలు అందించలేక అందుబాటులో ఉన్న వైద్యులు సతమతం అవుతున్నారు. అత్యవసర వైద్యం అందించడం తలకుమించిన భారంగా మారింది. ఏళ్ల తరబడి పోస్టులు భర్తీ చేయకపోవడం వల్ల ఈ పరిస్థితి నెలకొంది. ఫలితంగా మెరుగైన సేవలు అందక రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో 17 మందికి గాను ప్రస్తుతం ఏడుగురు డాక్టర్లే ఉన్నారు.

ప్రస్తుతం డాక్టర్లు ఇలా..

జిల్లాలోని పెద్ద ఆస్పత్రుల్లో ఆలేరు కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ఒకటి. ఈ ఆస్పత్రికి నానాటికీ రోగుల తాకిడి పెరుగుతోంది. రోజూ 250 నుంచి 300 ఓపీ నమోదవుతోంది. సీజనల్ వ్యాధుల సమయంలో ఓపీ రెట్టింపు ఉంటుంది. ప్రస్తుతం ఆస్పత్రిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్లు ఎనిమిది మంది ఉండాలి. ఇందులో ఇద్దరు అనధికారికంగా రావడం లేదు. ఒకరు పిజీ చేయడానికి వెళ్లారు. ఇద్దరు అనస్తీషియన్లు ఉండాలి. అందులో ఒకరు రావడం లేదు. ఇద్దరు పిడియాట్రిక్ (చిన్న పిల్లల డాక్టర్) వైద్యులకు ఒకరు మాత్రమే ఉన్నారు. ఫోరెన్సిక్ మెడిసిన్ (ఎంఎల్‌సీఎస్–పోస్ట్ మార్టమ్) డాక్టర్ పోస్టు నెలల తరబడి ఖాళీ ఉంది. డెంటల్ పరికరాలు ఉన్నా డాక్టర్ మాత్రం లేడు. వీటితో పాటు రేడియాలజిస్ట్ పోస్టు ఖాళీగా ఉంది. అవసరం ఉన్నప్పుడు రామన్నపేట ఆస్పత్రి నుంచి పిలిపిస్తున్నారు.

ప్రైవేట్ ఆస్పత్రులకు రెఫర్

ప్రమాదాలు సంభవించి క్షతగాత్రులైనా, క్రిమిసంహారక మందు తాగిన వారిని ఆస్పత్రికి తీసుకువస్తే వారి ప్రాణాలకు భరోసా ఉండడం లేదు. చిన్నచిన్న చికిత్సలు చేసి మెరుగైన వైద్యం కోసం ఇతర ఆస్పత్రులకు రెఫర్ చేస్తున్నారు. పూర్తిస్థాయిలో వైద్యులు లేకపోవడంతో మెరుగైన వ్యైదం అందడం లేదు. ఉన్న వైద్యులు కూడా సమయపాలన పాటించడం లేదని, కొందరు మధ్యాహ్నానికి వెళ్లిపోతున్నారని రోగులు చెబుతున్నారు.

హామీ నెరవేరేనా..

ఆలేరు సీహెచ్‌సీని 30 పడకల నుంచి 100 పడకలకు అప్‌గ్రేడ్ చేస్తామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. రాష్ట్రంలో ప్రభుత్వం మారడంతో హామీ నెరవేరలేదు. ఆ తరువాత ఎన్నికైన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య కూడా ఆస్పత్రిని సందర్శించిన సమయంలో 100 పడకలకు పెంచుతామని హామీ ఇచ్చారు. రోగుల తాకిడి పెరగడం, అందుకు అనుగుణంగా డాక్టర్లు లేకపోవడంతో నాణ్యమైన సేవలు అందడం లేదన్న విమర్శలున్నాయి. ఆస్పత్రిని అప్‌గ్రేడ్ చేసి, పూర్తిస్థాయిలో వైద్యులను నియమించాలని ప్రజలు కోరుతున్నారు.

సీబీపీ, డెంటల్ పరికరాలూ నిరుపయోగమే..

పది నెలల క్రితం కొనుగోలు చేసిన సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) మిషన్ చెడిపోయి ఆస్పత్రిలో నిరుపయోగంగా ఉంది. సీజనల్ జ్వరాలు ప్రబలుతున్న ప్రస్తుత తరుణంలో సీబీపీ మిషన్ పనిచేయక పోవడం వల్ల రోగులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. సీబీపీ ద్వారానే రోగ నిర్ధారణ చేయాలి. టెస్టులు చేసి రక్త నమూనాలు సేకరించి భువనగిరిలోని తెలంగాణ డయాగ్నోస్టిక్ సెంటర్‌కు పంపుతున్నారు. అంతేకాకుండా టెక్నీషియన్ లేకపోవడంతో ఎక్స్‌రే గదికి తాళం పడింది. డెంటల్ పరికరాలు వినియోగించడం లేదు.



పనిచేయని సీబీపీ మిషన్

త్వరలోనే అప్‌గ్రేడ్ చేయిస్తా

ప్రభుత్వంతో మాట్లాడి త్వరలోనే ఆలేరు ఆస్పత్రిని వంద పడకలుగా అప్‌గ్రేడ్ చేయిస్తా. ఆస్పత్రి స్థాయిని వంద పడకలకు పెంచుతామని గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రగల్భాలు పలికి మాట నిలబెట్టుకోలేదు. రాబోయే రోజుల్లో ఆస్పత్రిని మరింత అభివృద్ధిలోకి తీసుకువస్తాం. డాక్టర్ పోస్టులను భర్తీ చేసేలా చర్యలు తీసుకుంటాం. డయాలసిస్ సెంటర్‌ను కూడా 20 బెడ్లకు అప్‌గ్రేడ్ చేయిస్తా.

–బీర్ల అయిలయ్య, ప్రభుత్వ విప్



కవాతు నిర్వహిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు

ఆర్‌ఎస్‌ఎస్ దేశభక్తులు కలిగిన సంస్థ

- డాక్టర్ హీరేకార్ శివకుమార్

భువనగిరి : ఆర్‌ఎస్‌ఎస్ దేశ భక్తులు కలిగిన సంస్థ అని డాక్టర్ హీరేకార్ శివకుమార్ పేర్కొన్నారు.ఆర్‌ఎస్‌ఎస్ ఆవిర్భవించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం భువనగిరిలో కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హీరేకార్ మాట్లాడుతూ.. దేశం కోసం ఆర్‌ఎస్‌ఎస్ ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తుందని, ముమ్ముందు ఇదే వరవడి కొనసాగిస్తుందన్నారు. సేవాభారతి తెలంగాణ ప్రాంత సంఘటన మంత్రి ఉసులుమర్రి వాసు మాట్లాడుతూ.. హిందుత్వపై కుట్రలు జరుగుతున్నాయని, హిందువులు సంఘటితం కావాలని కోరారు. కార్యక్రమంలో సూదగాని అంజనేయులు, భిక్షపతి, ఆరేటి గణేష్, విజయభాస్కర్,సత్తి వినోద్,ప్రవీణ్, నర్ల నర్సింగ్‌రావు, కన్నయ్య, చందు, భరత్, బీజేపీ, వీహెచ్‌పీ, ఏబీవీపీ, హిందువాహిని కార్యకర్తలు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు, చిత్రంలో హీరేకార్ శివకుమార్

క్లుప్తంగా

'కుంపటి' దీర్ఘ కవిత ఆవిష్కరణ



కుంపటి దీర్ఘ కవితను ఆవిష్కరిస్తున్న జూలూరి గౌరీశంకర్

మునగాల: మండలంలోని నారాయణగూడెం గ్రామానికి చెందిన బాణాల శ్రీనివాసరావు రాసిన 'కుంపటి' దీర్ఘ కవితను నారాయణగూడెం గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఆదివారం తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పుస్తకావిష్కరణ సభలు పల్లెలు, గ్రామాలకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఉప్పల యుగంధర్‌రెడ్డి, దేవినేని వీరభద్రరావు, గోపిరెడ్డి కోటిరెడ్డి, నాగిరెడ్డి, సూరగాని రాంబాబు, సోమిరెడ్డి వీరారెడ్డి, కాసాని వీరస్వామి, ప్రతాపరెడ్డి, మిట్టగణుపుల రామకృష్ణ పాల్గొన్నారు.

కుమార్తెతో కలిసి మహిళ అదృశ్యం



సుధ



కావ్య

నల్లగొండ క్రైం: కుటుంబ తగాదాలతో భర్తతో గొడవపడి కుమార్తెను తీసుకుని మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయింది. నల్లగొండ వన్ టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని ఇందిరానగర్‌కు చెందిన కత్తుల సుధ తన భర్త ప్రసాద్‌తో గొడవపడి కుమార్తె కావ్యను తీసుకుని ఇంటి నుంచి వెళ్లిపోయింది. సుధ మానసిక వ్యాధితో బాధపడుతుందని ఆమె అత్త కత్తుల ప్రమీల ఆదివారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



రామనర్సమ్మ (ఫైల్)

నూతనకల్: వ్యవసాయ కూలీ పనులకు వెళ్లిన మహిళ అనుమానాస్పదస్థితిలో మృతి చెందింది. ఈ ఘటన నూతనకల్ మండల పరిధిలోని పెదనెమిల గ్రామంలో ఆదివారం జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. పెదనెమిల గ్రామానికి చెందిన గడ్డం రామనర్సమ్మ(40) ఆదివారం అదే గ్రామానికి చెందిన కనకం నాగరాజు మిరప తోటలో కలుపు తీసేందుకు వెళ్లింది. మధ్యాహ్నం పిడుగుపాటుకు ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లిందని రైతు నాగరాజు గ్రామానికి చెందిన గణేష్ ఆటోలో ఇంటికి తరలించాడు. ఆమె అప్పటికే మృతిచెంది ఉండటం, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ఆరుబయట మంచంలో పడుకోబెట్టి వెళ్లారు. ఇంటికి వెళ్తున్న క్రమంలో రామనర్సమ్మ తమతో పాటు కొంతదూరం వచ్చి మధ్యలో ఆగిపోయిందని, కొద్దిసేపటికే ఆమె చనిపోయిందని తెలిసినట్లు తోటి కూలీలు తెలిపారు. రామనర్సమ్మ మృతిపై ఆమె భర్త వెంకటేశ్వర్లు పలు అనుమానాలు వ్యక్తం చేశాడు. గతంలో నాగరాజు తన భార్యపై దాడి చేశారని, పిడుగుపాటుతో చనిపోయిన ఆనవాళ్లు లేవని, తన భార్య మృతికి నాగరాజే కారణమని ఆరోపించాడు. ఈ విషయమై నూతనకల్ ఇన్‌చార్జి ఎస్ఐ వీరన్నగౌడ్‌ను వివరణ కోరగా.. వెంకటేశ్వర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించినట్లు తెలిపారు. మృతురాలికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

'బేతవోలు' అవినీతిపై ఆగిన విచారణ

- ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న బాధిత రైతులు
- పూర్తిస్థాయి విచారణ చేయాలని డిమాండ్ చేస్తున్న రైతులు, డైరెక్టర్లు



ఈ ఫొటోలోని మహిళ పేరు మామిడి జ్యోతి. ఊరు చిలుకూరు మండలం జెర్రిపోతులగూడెం గ్రామం. ఈమె బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో 2023 సెప్టెంబర్‌లో రూ.20 వేలు క్రాప్ లోన్ తీసుకుంది. లోన్ తీసుకున్న సమయంలో ఎక్కువ ఇవ్వమని సహకార సంఘం అధికారులను అడగగా ఇప్పుడు బడ్జెట్ లేదని, తర్వాత ఇస్తామని సహకార సంఘం అధికారులు చెప్పారు. ఇటీవల అవినీతి ఆరోపణలతో సహకార సంఘం సీఈఓ, క్యాషియర్‌ను సస్పెండ్ చేశారు. అయితే 10 రోజుల క్రితం జ్యోతి తాత్కాలిక సీఈఓను కలిసి లోన్ పెంచమని అడగగా.. ఇప్పటికే రూ.60వేలు తీసుకున్నట్లు రికార్డుల్లో ఉందని చెప్పారు. దీంతో ఆమే ఒక్కసారిగా అవాక్కయ్యింది.



బేతవోలు ప్రాథమిక సహకార సంఘం కార్యాలయం

చిలుకూరు: బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై కోదాడ సహకార బ్యాంక్ అధికారులు, ఆడిటర్లు తూతూమంత్రంగా విచారణ చేపట్టి వదిలేశారని బాధిత రైతులు ఆరోపిస్తున్నారు. బాధ్యులైన సంఘం సీఈఓ, క్యాషియర్‌ను మాత్రమే సస్పెండ్ చేసి చేతులు దులుపుకున్నారని విమర్శిస్తున్నారు. బేతవోలు ప్రాథమిక సహకార సంఘం పరిధిలో 2021లో ఎరువుల అమ్మకానికి సంబంధించి రూ.15లక్షల కుంభకోణం జరిగినట్లు ఆ సంవత్సరం ఆడిట్‌లో తేలింది. దీనిని పూడ్చేందుకు రైతులకు తెలియకుండా వారి పేరిటే రుణాలు తీసుకున్నట్లు సృష్టించారు. ఇటీవల రైతులకు రుణమాఫీ కాకపోవడంతో ఈ కుంభకోణం బయటపడింది. ఇదే విషయమై గత నెల 10వ తేదీన సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీంతో రెండు రోజులు కోదాడ సహకార బ్యాంక్ అధికారులు, ఆడిటర్లు హడావుడిగా విచారణ చేశారు. 2021 సంవత్సరానికి సంబంధించి జనవరి నుంచి మార్చి వరకు రికార్డులు పరిశీలించారు. ఈ విచారణలో సంఘం పరిధిలోని నలుగురు రైతులకు తెలియకుండా రూ.4లక్షలు రుణాలు తీసుకున్నట్లు తేలింది. ఈ మేరకు సంఘం పాలకవర్గ సభ్యులు గత నెల 12వ తేదీన అత్యవసర సమావేశం నిర్వహించి సంఘం సీఈఓ, క్యాషియర్‌ను సస్పెండ్ చేస్తూ తీర్మానం చేశారు. అనంతరం వారిద్దరిని సస్పెండ్ చేసిన తాత్కాలిక సీఈఓ, క్యాషియర్‌ను నియమించారు.

రూ.20లక్షలకు పైగానే కుంభకోణం..

ఆ తర్వాత నుంచి బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో జరిగిన అవినీతిపై జరగాల్సిన విచారణ ఆగిపోయింది. ఇదేమిటని పలువురు సంఘం డైరెక్టర్లు, రైతులు కోదాడ సహకార బ్యాంక్ అధికారులను అడిగితే.. విచారణ చేయడానికి సమయం లేదు అంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెబుతున్నారని ఆరోపించారు. అవినీతి జరిగిన రూ.4 లక్షలకు సంబంధించి ఇప్పటివరకు ఇద్దరు రైతుల డబ్బులనే రికవరీ చేశారని, మరో ఇద్దరు రైతులు డబ్బులు రికవరీ చేయకపోవడంతో మరిన్ని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. 2021 నుంచి నేటి వరకు పూర్తిస్థాయి విచారణ చేస్తే రూ.20 లక్షలకు పైగా కుంభకోణం బయటపడుతుందని రైతులు అంటున్నారు. గత కొన్ని రోజులుగా బేతవోలు గ్రామానికి చెందిన దొంగరి నాగేశ్వరరావుతో మరో నలుగురు రైతులు, కొండాపురం గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు, జెర్రిపోతులగూడేనికి చెందిన మహిళా రైతు, ఆచార్యులగూడేనికి చెందిన ఇద్దరు రైతులు తాము సహకార సంఘంలో తీసుకున్న రుణం కంటే ఎక్కువగా చూపిస్తున్నారని కార్యాలయం చుట్టూ తిరుగుతున్నారు. దాదాపు 20 మందికి పైగా బాధిత రైతులు ఉన్నట్లు తెలిసింది.

అధికారులు విచారణ చేయడం లేదు



బేతవోలు ప్రాథమిక సహకార సంఘంలో అవినీతి జరిగిందని సాక్ష్యాలతో సహా కోదాడ సహకార బ్యాంక్ అధికారులు ఇచ్చినా విచారణ చేయడం లేదు. బాధిత రైతులు మా దగ్గరకు వస్తున్నారు. అవినీతి జరిగిన డబ్బులను నేటి వరకు రికవరీ చేయలేదు. ఇప్పటికైనా జిల్లా అధికారులు పూర్తి స్థాయి విచారణ చేస్తే అసలు విషయం బయటకు వస్తుంది.

– మద్ది సుదర్శన్‌రెడ్డి, బేతవోలు సహకార సంఘం డైరెక్టర్

లలితాత్రిపురసుందరీ దేవిగా భక్తులకు దర్శనం



లలితా త్రిపురసందరీ దేవి అలంకరణలో అమ్మవారికి హారతి ఇస్తున్న అర్చకుడు

యాదగిరిగుట్ట: యాదాద్రీశుడి ఆలయానికి అనుబంధంగా కొనసాగుతున్న శ్రీపర్వత వర్ధిని సమేత రామలింగేశ్వరస్వామి ఆలయంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. నాల్గవ రోజైన ఆదివారం అమ్మవారిని లలితాత్రిపురసుందరీ దేవి అలంకారంలో తీర్చిదిద్దారు. అనంతరం ప్రాతఃకాల పూజ జరిపించి, అర్చనలు, పారాయణాలు, గాయత్రీ జపం, లలితాసహస్ర నామార్చన, మధ్యాహ్న పూజ, నీరాజన మంత్ర పుష్పం వంటి కార్యక్రమాలు చేపట్టారు. సాయంత్రం 6.30గంటల తర్వాత శ్రీదేవి చతుషష్ఠి ఉపచార పూజ, సహస్ర నామార్చన, నీరాజన మంత్ర పుష్పములు వంటి వేడుకను జరిపించారు.

గంజాయి విక్రయిస్తున్న యువకుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

నార్కట్‌పల్లి: మండల పరిధిలో గంజాయి విక్రయిస్తున్న యువకుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఆదివారం సీఐ నాగరాజు, ఎస్ఐ డి. క్రాంతికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విశాఖపట్నం జిల్లా పెందుర్తి మండలం ద్రోణమరాజు గ్రామానికి చెందిన సాగి దిలీప్‌వర్మ నార్కట్‌పల్లి మండల కేంద్రం శివారులోని స్ఫెక్ట్రా వెంచర్‌లో శనివారం ఉదయం కొందరు విద్యార్థులకు గంజాయి అమ్మేందుకు యత్నిస్తుండగా.. విశ్వసనీయ సమాచారం మేరకు నార్కట్‌పల్లి ఎస్ఐ క్రాంతికుమార్ తన సిబ్బందితో వెళ్లి అతడిని పట్టుకున్నారు. సులభంగా డబ్బులు సంపాదించడం కోసం పట్టుబడిన యువకుడు గంజాయి విక్రయిస్తున్నట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు. హైదరాబాద్‌లో 2 కేజీల గంజాయి కొనుగోలు చేసి అందులో కొంత అమ్మి మిగిలిన గంజాయిని నార్కట్‌పల్లికి స్కూటీపై తీసుకొచ్చి చిన్న చిన్న ప్యాకెట్ల రూపంలో ఇక్కడ అమ్మేందుకు ప్రయత్నిస్తుండగా పట్టుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుని వద్ద నుంచి 650 గ్రాముల గంజాయి, స్కూటీని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ, ఎస్ఐ తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

- సీపీఐ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి



మాట్లాడుతున్న పల్లా వెంకట్‌రెడ్డి

గరిడేపల్లి: ప్రజా సమస్యల పరిష్కారమే సీపీఐ లక్ష్యమని, ఆ లక్ష్య సాధనలో ఎన్ని అవాంతరాలు ఎదురైనా ముందుకుసాగుతామని ఆ పార్టీ జాతీయ సమితి సభ్యుడు పల్లా వెంకట్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం గరిడేపల్లి మండల పరిధిలోని కల్మలచెరువు గ్రామంలో జరిగిన దివంగత సీపీఐ నేత దాసరి రామకృష్ణ సంతాప సభకు వారు హాజరై మాట్లాడారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం నుంచి ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమం వరకు జరిగిన అన్ని ప్రజా పోరాటాల్లో సీపీఐ కీలకంగా వ్యవహరించిందని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి మద్దతు ఇచ్చినప్పటికీ.. ప్రజలు ఇబ్బందులకు గురైతే ప్రజా ఉద్యమాలు చేపట్టడానికి వెనకాడబోమని తెలిపారు. కార్యక్రమంలో మండల పార్టీ కార్యదర్శి పోకల వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధూళిపాళ ధనుంజయనాయుడు, గుండు వెంకటేశ్వర్లు, నాయకులు కడియాల అప్పయ్య, పందిరి నాగయ్య, యల్లబోయిన సింహాద్రి, కత్తి శ్రీనివాస రెడ్డి, నంద్యాల రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్సీ మెసెంజర్స్ యూనియన్ కార్యవర్గం ఎన్నిక



కందుకూరి యాదగిరి, అధ్యక్షుడు




సీహెచ్. రుద్రగిరి, ప్రధాన కార్యదర్శి

మోత్కూరు: తెలంగాణ రాష్ట్ర ఎమ్మార్సీ మెసెంజర్స్ యూనియన్ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ఆదివారం మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా ఉప్పల్‌లో జరిగిన సమావేశంలో ఎన్నుకున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన ఇస్మాయిల్, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన జంగయ్య, నల్లగొండ జిల్లాకు చెందిన రహీం ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరుకు చెందిన కందుకూరి యాదగిరి మూడోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఖమ్మం జిల్లాకు చెందిన సీహెచ్. రుద్రగిరి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లాకు చెందిన సీహెచ్. ఉపేందర్ కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రాష్ట్ర ఉపాధ్యక్షులుగా గంగమ్మ, రమేష్, సురేష్, సంజీవ్, షమి, ధనుంజయ్, శ్రీనివాసరావు, తిరుపతయ్య, వెంకట్‌ను ఎన్నుకున్నారు.

మూసీకి కొనసాగుతున్న ఇన్‌ఫ్లో

- రెండు గేట్ల ద్వారా నీటి విడుదల



మూసీ గేట్లు ఎత్తడంతో దిగువకుపోతున్న నీరు

కేతేపల్లి: మూసీ ప్రాజెక్టుకు ఎగువ ప్రాంతాల నుంచి వరద కొనసాగుతోంది. దీంతో ఆదివారం ప్రాజెక్టు అధికారులు రెండు క్రస్ట్ గేట్ల ద్వారా 656.36 క్యూసెక్కుల నీటిని దిగువకు నీటిని విడుదల చేశారు. కుడి, ఎడమ కాల్వలకు 559.93 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎగువ ప్రాంతాల నుండి ప్రాజెక్టుకు 2196.51 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. 645 అడుగుల గరిష్ఠ నీటి మట్టం గల ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రం వరకు నీటిమట్టం 644.30 అడుగుల మేర నీరు ఉంది. పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 4.46 టీఎంసీలు కాగా ప్రస్తుతం 4.28 టీఎంసీల నీరు నిల్వ ఉందని ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

ట్రాక్టర్లలోని బ్యాటరీలు చోరీ

మునగాల: మండలంలోని కృష్ణానగర్, బరాఖత్‌గూడెం గ్రామాలతో పాటు చిలుకూరు మండలం పోలేనిగూడెం గ్రామాల్లో శుక్రవారం అర్ధరాత్రి దొంగలు రెచ్చిపోయారు. ఆయా గ్రామాల్లోని రైతులు తమ ఇళ్ల ముందు పార్కింగ్ చేసిన ట్రాక్టర్లలోని బ్యాటరీలను గుర్తుతెలియని వ్యక్తులు చోరీ చేశారు. కృష్ణానగర్‌లో 10, బరాఖత్‌గూడెంలో 3, పోలేనిగూడెంలో 5 బ్యాటరీలు ఎత్తుకెళ్లారు. బాధితులు శనివారం మునగాల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

బాలికపై లైంగిక దాడి..?

చండూరు: నల్లగొండ జిల్లా చండూరు మండలం పరిధిలోని ఓ గ్రామంలో ఆదివారం రాత్రి బాలికపై ఓ వ్యక్తి లైంగిక దాడికి పాల్పడినట్లు విశ్వసనీయ సమాచారం. ఓ గ్రామానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి పత్తి తీసేందుకు ఇటీవల కూలీలు వచ్చారు. ఇదే గ్రామంలో తల్లి లేని ఇద్దరు బాలికలు(సుమారు 9 నుంచి 10 ఏళ్ల లోపు) తమ తాత దగ్గర ఉంటున్నారు. వలస వచ్చిన కూలీల్లో ఓ వ్యక్తి ఆ బాలికల తాతతో పరిచయం ఏర్పరచుకుని అతడికి మద్యం తాగిపిస్తూ స్నేహం పెంచుకున్నాడు. ఆదివారం రాత్రి వృద్ధుడికి మద్యం తాగించి ఇద్దరు బాలికల్లో ఒకరిపై లైంగిక దాడికి పాల్పడినట్లు తెలిసింది. గ్రామస్తులు ద్వారా పోలీసులు సమాచారం తెలుసుకుని నిందితుడి కోసం గాలిస్తున్నట్లు సమాచారం.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. పలువురికి గాయాలు



ఘటనా స్థలంలో వివరాలు తెలుసుకుంటున్న నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు

నల్లగొండ క్రైం: నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని మర్రిగూడ బైపాస్‌లో శనివారం అర్ధరాత్రి ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో పలువురు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. ప్రయాణికులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ నుంచి చెన్నైకి 40మంది ప్రయాణికులతో వెళ్తున్న ఆరెంజ్ ట్రావెల్స్ బస్సు మర్రిగూడ బైపాస్ వద్దకు రాగానే అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం జరుగుతుండటంతో అది గమనించని డ్రైవర్ అకస్మాత్తుగా బ్రేక్ వేయడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని నంద్యాలకు చెందిన బాచిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డికి కుడి చేయి విరిగగా.. తిరుపతికి చెందిన రవితేజ, హేమశ్రీ(గర్భిణి), చెన్నైకి చెందిన అఫ్జల్, అనన్య, హైదరాబాద్‌కు చెందిన కిషోర్, గుర్రం సంధ్యారాణి, కిరణ్‌బాబు, శ్వేత, వసంత్, రాజేశ్వర్‌రెడ్డి, నిజామాబాద్‌కు చెందిన మామిడి రవితేజ, కవితకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులకు నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం వారు తమ గమ్యస్థానాలకు వెళ్లిపోయారు. బాధితుడు బాచిరెడ్డి అమర్‌నాథ్‌రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కరీంనగర్‌కు చెందిన బస్సు డ్రైవర్ పుంద్రా మనోహర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నల్లగొండ రూరల్ ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

మూడు దశాబ్దాల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్న బీఈడీ 1995-96 బ్యాచ్ పూర్వ విద్యార్థులు

నాగార్జునసాగర్: నాగార్జునసాగర్ ప్రభుత్వ బీఈడీ కళాశాలకు అనుబంధంగా ఉన్న ఎస్‌పీఏఆర్ ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1995–96లో బీఈడీ పూర్తిచేసుకున్న పూర్వ విద్యార్థులు మూడు దశాబ్దాల తర్వాత ఆదివారం తిరిగి అదే ప్రాంగణంలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. తమ చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. తమకు చదువు చెప్పిన గురువులను ఘనంగా సన్మానించుకున్నారు. కళాశాల పూర్వ విద్యార్థి ప్రస్తుత ఎస్‌పీఏఆర్ ఆదర్శ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుడిగా ఉన్న శేషు ఈ సమావేశానికి అధ్యక్షుడిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఆనాడు కళాశాలలో పనిచేసిన గురువులు కొల్లూరు వెంకటేశ్వర్ రావు, వెంకట్‌రెడ్డి, గురువయ్య, టీవీ ప్రసాద్, మహ్మద్ యూసుసూఫ్, జగన్నాథం, కృష్ణవేణి, వెంకటేశ్వర్లు, ప్రసాద్ విద్యార్థులు గడ్డం శ్యాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా పడి వ్యక్తి మృతి

ఆత్మకూర్ (ఎస్): ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తా పడడంతో వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని నెమ్మికల్ శివారులో ఆదివారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని బోరింగు తండాకు చెందిన గుగులోత్ మల్సూర్(30) పత్తి ఏరేందుకు ఆదివారం నెమ్మికల్ నుంచి కూలీలను బోరింగుతండాకు తీసుకొచ్చాడు. సాయంత్రం తిరిగి వారిని దింపేందుకు ట్రాక్టర్‌లో తీసుకెళ్తున్నాడు. నెమ్మికల్ శివారులో రోడ్డుపై గుంతలు పూడ్చేందుకు కంకర కుప్పలు పోయగా ట్రాక్టర్ కంకర కుప్పల పైకి ఎక్కడంతో అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో మల్సూర్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం చోరీ



వడ్ల రాశిపై కప్పిన టార్పాలిన్‌ను తొలగించిన దుండగులు

భూదాన్‌పోచంపల్లి: పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ముక్తాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో శనివారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ధాన్యం దొంగలించారు. చింతబావికి చెందిన బండారు బాల్‌రెడ్డి, బండారు జంగారెడ్డి రెండు రోజుల క్రితం వరి ధాన్యాన్ని ట్రాక్టరల్లో తీసుకొచ్చి ముక్తాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో పోసి కుప్పలపై టార్పాలిన్ కవర్లు కప్పి ఇంటికి వెళ్లిపోయారు. ఆదివారం వచ్చి చూడగా వీరి ధాన్యం కుప్పల నుంచి గుర్తుతెలియని వ్యక్తులు వడ్లను చోరీ చేశారు. చోరీకి గురైన ధాన్యం విలువ సుమారు రూ.30వేల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొంటున్నారు. గత సీజన్‌లో కూడా వడ్లు చోరీకి గురయ్యాయని వారు తెలిపారు. కొనుగోలు కేంద్రం వద్ద రాత్రివేళ కాపలాదారుడిని పెట్టాలని కోరుతున్నారు.

సాయినాథుడిని దర్శించుకున్న సినీ హీరో శ్రీకాంత్



సాయినాథుడి సన్నిధిలో సినీ హీరో శ్రీకాంత్

చింతపల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయినాథుడి ఆలయాన్ని ఆదివారం సినీ హీరో శ్రీకాంత్ దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సాయినాథుడిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆలయంలోని గోశాల తనను ఎంతగానో ఆకట్టుకుంటుందన్నారు. ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి పూలమాలలు, శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మంచికంటి ధనంజయ, ప్రధాన కార్యదర్శి కొమ్మిశెట్టి వెంకటయ్య, కోశాధికారి ఊరె కృష్ణయ్య, కుంభం పుల్లారెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



పరమేష్ గౌడ్ (ఫైల్)

చింతపల్లి: జీవితంపై విరక్తితో పురుగుల మందు తాగిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటన చింతపల్లి మండలం గోడకొండ గ్రామంలో జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గోడకొండ గ్రామానికి చెందిన పాలకూరల పరమేష్ గౌడ్(55) గ్రామంలో వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. జీవితంపై విరక్తితో వారం రోజుల క్రితం అతడు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగాడు. బంధువులు గమనించి హైదరాబాద్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులకు పేర్కొన్నారు.

చెట్టును ఢీకొన్న లారీ.. డ్రైవర్ దుర్మరణం

బీబీనగర్: మండల కేంద్రంలోని వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై ఆదివారం తెల్లవారుజామున లారీ అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతిచెందాడు. ఎస్ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. భువనగిరి మండలం రెడ్డినాయక్‌తండాకు చెందిన లారీ డ్రైవర్ ధరావత్ నర్సింహ(41) ఆదివారం తెల్లవారుజామున ఇసుక లోడ్‌తో హైదరాబాద్ వైపు వెళ్తున్నాడు. బీబీనగర్‌లోని మాధవరెడ్డి విగ్రహం సమీపంలో వరంగల్–హైదరాబాద్ జాతీయ రహదారిపై కుక్కలు అడ్డురావడంతో వాటిని తప్పించబోయే క్రమంలో లారీ అదుపుతప్పి సర్వీస్ రోడ్డులోని చెట్టును ఢీకొట్టింది. తీవ్రగాయాలపాలైన నర్సింహను ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కాలిఫోర్నియాలో పూల సంబురం



అమెరికాలోని కాలిఫోర్నియాలోని సాన్ రామన్‌లో నివాసముంటున్న నేరేడుచర్లకు చెందిన దొంతిరెడ్డి కవిత, అలుగుబెల్లి నిహారిక, కొణతం విజయలక్ష్మి, కస్మంతరెడ్డి సౌజన్య, మాధవి, సాహితి, సిందూజ, శైలజ, మనోజ్ఞ, దీప్తి తదితరులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి సంబరాలు చేసుకుంటున్నారు. – నేరేడుచర్ల

అట్లాంటాలో బతుకమ్మ వేడుకలు



అమెరికా దేశంలోని అట్లాంటా నగరంలో ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మహిళలు తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ వేడుకలు జరుపుకుంటున్నారు. నల్లగొండ, సూర్యాపేట, మిర్యాలగూడ పట్టణాలతో పాటు సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలానికి చెందిన మహిళలు ఈ వేడుకల్లో పాల్గొన్నారు. – అర్వపల్లి